**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

# ప్రజాతీర్పును వమ్ము చేయొద్దు

**వైసిపి, టిడిపిలకు సిపిఎం హెచ్చరిక**

**హోదా, పోలవరం, విశాఖ ఉక్కు, విభజన హామీలపై పార్లమెంటులో నిలదీయాలి**

**జనసేన ఎన్‌డిఏలో చేరడం ఆత్మహత్యాసదృశ్యం**

**యుసిసి బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించాలి**

పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్రాన్ని నిలదీయాలని వైసిపి, టిడిపిలను సిపిఎం కోరింది. బుధవారం విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం సమీపంలోని ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావుతో కలిసి మాట్లాడారు.

దేశంలో మోడీపై భ్రమలు తొలగిపోయాయని, దేశ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టడం తప్ప మరొకటి చేయలేదని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఎన్‌డిఏ సమావేశానికి హాజరైన 36 పార్టీల్లో 24 పార్టీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదని, 14 పార్టీలకు గుర్తింపే లేదని విమర్శించారు. రాష్ట్రంలో జనసేన పార్టీ ఆ సమావేశానికి వెళ్లిందని, ఏం సాధించిందో ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. మరోవైపు రాష్ట్రం విడిపోయి దాదాపు 10 ఏళ్లు కావస్తున్నా కేంద్రంలో బిజెపి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు. ఇచ్చిన మాట తప్పి విద్రోహం చేయడమే గాకుండా రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందని విమర్శించారు. ప్రతిఘటించే ప్రజల మధ్య, పార్టీల మధ్య చీలికలు తెచ్చి దేశాన్ని బలహీనపరుస్తోందని తెలిపారు. ఈ స్థితిలో రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా నిలబడి పోరాడాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని బిజెపికి తాకట్టు పెడుతున్నాయని మండిపడ్డారు.

రాష్ట్రం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని, ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదని, ఉపాధి, ఉద్యోగాలు లేవని అన్నారు. ఆఖరికి జీతభత్యాలకు సైతం అడుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అప్పులు అసాధారణంగా పెరిగిపోతున్నాయని, ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చుకోవాల్సింది పోయి రుణం కోసం వారు పెట్టిన షరతులకు తలవంచి ప్రజలపై మరిన్ని అదనపు భారాలు మోపుతున్నారని, ధరల పెరుగుదలకు ఈ విధానాలే కారణమని అన్నారు. విద్యుత్ ఛార్జీలు మోయలేనంతగా పెరిగాయని, ఆస్తిపన్ను, చెత్తపన్ను యూజర్ ఛార్జీల పేరుతో ప్రజల మాడు పగలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని వైసిపి, టిడిపి కేంద్రంతో పోరాడటానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ పార్లమెంటు సెషన్‌లో రాష్ట్రహక్కుల కోసం కేంద్రాన్ని నిలదీయడమే గాకుండా అవసరమైతే ఏ తరహా పోరాటానికైనా సిద్ధం కావాలని, ప్రజలు ఆ పార్టీలపై విశ్వాసం పెట్టి గెలిపించిన రుణాన్ని తీర్చుకోవాలని కోరారు. ఉమ్మడి సివిల్ కోడ్ (యుసిసి) పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశం మీద మతోన్మాద అజెండాను రుద్దాలని

ప్రయత్నిస్తుంటే లౌకికపార్టీలని చెప్పుకునే వైసిపి, టిడిపి దానికి తందానా అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. యుసిసిని పార్లమెంటులో వ్యతిరేకించాలని కోరారు.

**ఎన్‌డిఏ సమావేశానికి జనసేన వెళ్లడం రాష్ట్రానికి చేటు**

కేంద్ర విద్రోహానికి వ్యతిరేకంగా పోరాడతానని రంకెలు వేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఏకంగా ఎన్‌డిఏ గూటిలో చేరాడని, బిజెపి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్రంలో అమలు చేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటని అన్నారు. పవన్‌కళ్యాణ్‌పై జనసైనికులు, వీరమహిళలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశమంతా బిజెపిని ఓడించడానికి ఏకమవుతుంటే, జనసేన బిజెపి సరసన చేరడం రాష్ట్రంతోపాటు, ఆ పార్టీకీ ఆత్మహత్యాసదృశ్యమేనని తెలిపారు. బిజెపి రోడ్‌మ్యాప్‌ను పవన్ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపితో టిడిపి, జనసేన జతకడతాయని, ఎన్‌డిఏలో లేకపోయినా టిడిపితో అవగాహనకు వస్తామని బిజెపి ప్రకటించిందని, అయినా టిడిపి నోరు మెదపడం లేదని విమర్శించారు. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో బిజెపితో కూడిన ఏ పార్టీ బతికి బట్టకట్టలేదని, విచ్ఛిన్నం, చీలికలు, పీలికలు అయ్యాయని తెలిపారు. దానిపై పోరాడుతున్న పార్టీలే మనుగడలో ఉన్నాయని వివరించారు. బిజెపితో పొత్తుపెట్టుకునే విషయంలో వస్తున్న వార్తలపై తెలుగుదేశం వివరణ ఇవ్వాలని, లేనిఎడల ఈ పార్టీలన్నీ బిజెపి గూటి పక్షులుగానే ప్రజలు భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌డిఏతో కలిసి ఉండి బిజెపిని బలపరుస్తూ తమకు తామూ లౌకికవాదులమని చెప్పుకునే అర్హత ఏ పార్టీకీ ఉండదని, అది ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని అన్ని పార్టీలను, ప్రజానీకాన్ని కోరారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా గళం విప్పాలని మేధావులకు విజ్ఞప్తి చేశారు.